

# అమెరికా అమ్మాయి

– శ్రీనిధి యెల్లల



## నవంబరు వైరాగ్యం

**ఏ దేవత** దయతలచిందో ఈ యేడు దీపావళి పండుగ ఆదివారం నాడు పడింది. మన పండుగ వారాంతాల్లో రావడం అంటే మామూలు విషయం కాదు. ఎంచక్కా ఇంట్లో ఉండే ముగ్గురో, నలుగురో ఎక్కడికీ పరుగులు పెట్టకుండా ఇంటి పట్టునే ఉంటారు. తలంట్ల దగ్గరినుండి భోజనం చెయ్యడం వరకూ అందరూ కలిసి ఉండటం, సాయంత్రాలు ఇష్టమైన వారిని కలుసుకోడం ఇలా హాయిగా హడావిడి పడకుండా గడచిపోతుంది. ముందే అందిన సమాచారం వల్ల పండుగ సామానంతా రెండు రోజుల ముందే తెచ్చి పెట్టేసుకున్నాము. లేకపోతే మా బే ఏరియాలో నరకచతుర్దశికి ఇండియన్ స్టోర్స్ క్యూ లో నిల్చున్న వాళ్ళు అమావాస్య వెళ్ళాక కానీ బయటపడలేదుట. ఎంత దీపావళీ డిస్కౌంట్ సేల్స్ అయితే మాత్రం! మరేమి కొంటున్నారో ఆ దేవుడికే తెలియాలి బాబూ. వీళ్ళతో పాటు ప్రమిదలనీ, ఒత్తులూ – నేతులూ అనీ, పిల్లల కళ్ళల్లో కనిపించే మతాబులకోసం ఏదో శాస్త్రానికి ఓ నాలుగంటే నాలుగు కాకరపూవొత్తులు ఉండే ప్యాకెట్ల కోసమని, కొబ్బరికాయలు, అరిటాకుల కోసమని ఇండియన్ స్టోర్లకు చివరి నిమిషంలో పరుగులు పెట్టే వారు కొందరు. తీర్థాల్లో మాదిరి ఉంటారు పండగలప్పుడు జనం. ముందు ముందు దీపావళికి పార్కుల్లో తిరనాళ్ళు పెట్టే సూచనలు దండిగా కనపడుతున్నాయి.

దీపావళి వెళ్లీవెళ్లగానే హాలోవీన్ వచ్చింది. చిన్నపిల్లలకి అదో సంబరం. మా ఊర్లో గంగమ్మ జాతరకి నల్లబట్టలు కట్టుకుని, సున్నపు బొట్లు పెట్టుకుని వేపాకు మండలతో, కనిపించిన పిల్లలందరినీ జడిపిస్తూ ఊరంతా పరిగెత్తించేవాడు గంగవేషకాడు. ఇక్కడేమో పిల్లలే వేషాలు వేసుకుని అందరినీ జడిపిస్తూ ఉంటారు. ఈ సారి పిల్లది ఏదైనా ప్రత్యేకంగా కావాలమ్మా హాలోవీన్ కి అంటే విఠలాచార్య 'జగన్మోహిని' సినిమాలో తెల్ల లెగ్గింగ్స్ వేసుకునే పిల్ల భూతంలా పంపించా. దానికో పెద్ద గుమ్మడికాయ ప్రైజుగా ఇచ్చారు ప్లే స్కూల్లో. ఈ నెల నే రోజూ పెట్టుకునే కార్తీక దీపం పక్కనే తన గుమ్మడికాయలో ఒక కాండిల్ పెట్టి పెట్టింది. 'కార్తీక దీపం' పక్కనే 'జాక్-ఓ-లాంతరు'. మన జాతీయ జెండా పక్కన అమెరికా జెండా హాయిగా రెపరెపలాడుతున్నట్టు అనిపించింది.

ఆ విధంగా అక్టోబరు నెల జంట పండుగల సంబరాలతో ముగిసింది. ఇహ ఈ నవంబరు నెల గండం గడిస్తే ఎంచక్కా హాలిడే సీజన్. నవంబరు నెలంటేనే నాకు వణుకు. చలి వల్ల కాదండీ థాంక్స్ గివింగ్ షాపింగ్ వల్ల. అసలైతే నేను సరీగ్గా థాంక్స్ గివింగ్ సేల్స్ అన్నీ అయిపోయిన తరువాత అడుగు పెట్టాను అమెరికాలో, మొదటిసారి. ఇండియాలో పెళ్లి తర్వాత ఎంతో ఇష్టంగా కొత్త సంసారానికి కొనుక్కున్న ఫర్నిచరూ, మంచాలూ, బీరువాలూ, అప్పుడే రిబ్బన్ కటింగ్ చేసిన కొత్త స్టీలు షాపులాగా మెరిసిపోతూ ఉండే వంటిల్లు ఇలా అన్నిటిని వదిలేసి వచ్చాను. ఎన్ని రోజులు బాధపడివుంటానో ఆ సామాను కోసం. సరిగ్గా ఇద్దరు మనుషులకి సరిపోయేట్టు రెండేసి గిన్నెలు నాలుగేసి గరిటలతో మొదలైంది సంసారం ఇక్కడ. ఇల్లంతా అప్పుడే దొంగలు పడి దోచుకున్నట్టు బోసిగా ఉండేది.

అన్ని ఒక్కొక్కటిగా సమకూర్చుకుంటూ వచ్చేవాళ్ళం. పెద్ద పెద్ద సామాన్లకి మాత్రం థాంక్స్ గివింగ్ వరకూ ఆగాల్సిందే అని చెప్పేవారు ఈయన. "కొన్ని రోజులు ఆగావంటే నా బుర్రంతా ఉపయోగించి ఇల్లంతా నీకు కావాల్సిన వాటితో నింపేస్తాను " అని చెప్పారు. అసలు థాంక్స్ గివింగ్ సేల్స్ గురించి, బ్లాక్ ఫ్రైడే ఉదంతాల గురించి, డోర్ బస్టర్స్ ఆఫర్లకోసం గుడారాలు వేసుకుని ఎదురుచూసే వాళ్ళ గురించి కథలు కథలుగా అందరూ చెపుతుంటే ఏమిటో అనుకున్నాను. మా దశ తిరిగిపోతుంది వచ్చే నవంబరుతో, ఎంచక్కా చంద్రగిరి యువరాణికి మల్లే షాపింగ్ చెయొచ్చు అని ఎదురుచూడడం మొదలెట్టా.

థాంక్స్ గివింగ్ షాపింగ్ సేల్స్ గురించి ప్రతి స్టోరు సంవత్సరం పొడుగూతా ఒక టీంని స్పెషల్ గా పెట్టుకుంటుందేమో! ఆ లెక్కలు వాటి వెనకాల లొసుగులు బాబోయ్ కళ్ళు తిరిగిపోతాయ్. మొత్తానికి నేను కూడా మా ఫ్రెండ్స్ ని, మా గ్రూపులోని సీనియర్లని అడిగి ఏమేమి సామాను కొనాలో ఒక లిస్టు రాసుకున్నాను. మాములుగా ట్రాషులో వేసే జంక్ మెయిల్ అంతా పోగేసి ఇల్లంతా పరిచి కూపన్లన్నీ వెతికి ఒక గుత్తిగా కట్టేసాను. ఆన్లైన్ లో స్టోర్ల సైటుకి వెళ్లి ఒకే వస్తువుని వేరు వేరు షాపుల్లో ఎంతకి అమ్ముతున్నారో ఒక పుస్తకం తీసుకుని రాసుకుని పక్కన పెట్టుకునేదాన్ని. సాయంత్రం ఈయన వచ్చిన వెంటనే ఇద్దరం మళ్ళీ కూర్చుని నా పరిశోధనలో ఇంకాస్త వడపోతలు చేసి ఇంకో చిట్టా ఫెయిర్ కాపీ చేసేవాళ్ళం. ఒకానొక దీక్ష పూనినట్టు నిష్టగా తగు రీసెర్చ్ చేసిన తరువాత థాంక్స్ గివింగ్ రానే వచ్చింది. మొదటి సారి కదూ నా ఆనందానికి, ఉత్సాహానికి పట్టపగ్గాలు లేవంటే చూసుకోండి.

ముందుగా ఏ ఏ షాపుల్లోకి వెళ్లాలో ఎక్కడెక్కడ ఏమేమి కొనాలో, ఎంత సేపు ఒక్కో షాపుకి కేటాయించాలో ఒక చిట్టా రాసుకుని షాపింగ్ యుద్ధానికి బయలుదేరాం. అనుకున్న ప్రకారం ప్లాన్ అమలుపరచాము. మళ్ళీ షాపుల్లో కూడా సెక్షన్లను పంచుకుని చెలరేగిపోయాము. అదొక విజయం. అమెరికా వచ్చినప్పటినుండి ఊరిస్తున్న బ్రాండెడ్ హ్యాండ్ బ్యాగులకి ఓపిగ్గా రెండు గంటలు లైనులో నిలబడి గాలెం వేసి సంపాదించాను. అదొక కళ. వేలాది డిజైన్లు, తొంభై ఆరు రకాల బ్రాండ్ల మధ్య ముందుగా మన బడ్జెట్లో ఉండే బ్యాగుని గుర్తించి మెదడులో జ్ఞాపకం పెట్టుకోవాలి. ఒకసారి డిసైడ్ అయ్యాక వేరే ఎన్ని బ్రాండ్ల బ్యాగులు వయ్యారాలు పోయినా చలించకూడదు. ఓపిగ్గా ఎదురుచూసి పట్టేసుకోవాలి. చేతిలోకి కోరుకున్న కొత్త బ్యాగు తీసుకున్నాక ఆ నునుపు, ఆ పనితనం, ఆ గగుర్పాటు మాటల్లో చెప్పలేం! ప్రతి ఒక్కరికి ఎన్నేసి బ్యాగులు ఉన్నా మొదటి బ్రాండెడ్ బ్యాగ్ అనేది ఏదైతే ఉందో ఆ అనుభవం, అనుభూతి అనుపమానం అంటే నమ్మాలి. ప్రతి బ్రాండెడ్ బ్యాగ్ వెనకాల ఒక కథ ఉంటుంది మరి. ఇట్లా ఇంటి సామాను, ఎలెక్ట్రానిక్సు, బ్యాగులు వెరసి బోలెడు షాపింగ్ చేసేసి ఇంటికి చేరాం.

ఇల్లు చేరాక మొత్తం అన్ని స్టోర్ల నుండీ కొనిపట్టుకొచ్చిన సామానంతా ముందరేసుకు కూర్చున్నాము ఇక. రైసు కుక్కర్లు రెండూ, లేటెస్ట్ నాన్ స్టిక్ సెట్టు, కాఫీ మేకరు, బ్లెండర్లు, జ్యూసర్లు, కేక్ మిక్సర్లు, ఒకేసారి నాలుగేసి దోశలు వేసుకోగలిగే గ్రిడ్డిలు అబ్బో ఇట్లా చిత్ర విచిత్రమైన పరికరాలు అవసరమున్నా లేకున్నా శివరాత్రి తిరునాళ్లలో బుడుగులు కొన్నంత వీజీగా కొనిపడేసాము. ముందు జాగ్రత్తగా ఇండియాకి వెళ్ళేటప్పటికని చెప్పేసి ఓ మోస్తరు పేరున్న బ్యాగులు, స్ప్రేలు వగైరా సరంజామా కూడా కొనిపెట్టేసాము. ఇక బ్లాక్ ఫ్రైడే అనీ, సైబర్ మండే అని ఈయన ఎలక్ట్రానిక్స్ మీద విజృంభించారు. చేగోడీ పొట్లాలు కొన్నట్టు ఐఫోన్లు, టీవీ, ఎక్స్ బాక్సులు, ఐపాడ్లు, మ్యూజిక్ సిస్టమ్సు తెగ రీసెర్చ్ చేసేసి వాడుతామా లేదా అని ఆలోచించకుండా కాస్త తక్కువలో తక్కువ అని చెప్పి కొని అవతల పడేసారు. ఏదో మాయలో ఉన్నట్టు, మత్తులో ఉన్నట్టు జరిగిపోయింది అంతా. చేతులతో తైలం మారితే అన్నా తెలిసేది. అంతా మాయ కదా! ఆ తర్వాత వచ్చిన క్రెడిట్ కార్డు బిల్లు వల్ల ఆ ఏడు ఇండియా ట్రిప్ ఆగిపోయింది అనుకోండీ.

ఇంతోటి ఘనకార్యాలని మనవాళ్లతో చెప్పుకుని పొంగిపోకపోతే ఎలాగా? ఊరికెనే ఉండము కదా మనం! ఇండియాలో మావాళ్లకి చిలవలు పలవలు చేసి చెప్పేశా నా తెలివితేటల గురించి, మా వారి అద్భుత ప్రణాళికల గురించీ, అమెరికా వ్యాపారుల అమాయకత్వం

గురించీను. ఆ వార్తలను పలవలు చిలవలుగా మార్చి మార్చి ఈ ఊరూ ఆ ఊరు ఇష్టానికి మాట్లాడేసుకున్నాయి. సంవత్సరం వరకూ మాటు వేసి మళ్ళీ వచ్చే ఏటికి తగులుకున్నారు అంతా. "అమ్మాయ్! అక్కడ ఉల్లిపాయలూ, కూరగాయ ముక్కలూ తరుక్కునే మిషను ఈ సీజనులో చవకటగా ఒకటి కొనేసెయ్యి ...ఆనక నువ్ వచ్చేటప్పుడు పట్టుకుని వద్దువులే" అని ఒకరు. "అమ్మణ్ణి ...ఫలానా బ్రాండు లోషన్లు ఒక అర డజను తీసిపెట్టుకో"అని ఇంకొకళ్లు మొదలు. పెద్దవాళ్లన్నా కాస్త నయం సంసారపక్షమైన కోరికలు అడుగుతారు. ఈ కాలేజిలో ఉండే పిల్ల వెధవల్ని పట్టలేము. "అక్కా ఆన్లైన్ లో చూస్తున్నాను... ఫలానా ఐఫోను అక్కడైతే అంతే! ...ఇక్కడైతే ఇంతా...! నాకోటి తీసిపెట్టు. బావ వద్దనడు లే." "అక్కా ఫలానా బ్రాండ్ వాచ్ కావాలి ... ఫోటో పంపుతున్నా అదే రంగు ఒక్క షేడ్ కూడా తగ్గకూడదు" అనీ నా వైపు నుండి ఆయన వైపు నుండి విన్నపాలు వినవలె వింతవింతలు బాబోయ్.

అన్నేసి కొనలేము అంటే, *"అమెరికాలో ఉన్నారు కొనలేరా?"* అనంటారు. డాలర్లలో సంపాదిస్తాము సరే ...ఖర్చు కూడా డాలర్లే కదా, రూపాయల్లో కాదు కదా అని చెప్పామే అనుకోండి. ఆమ్మో! ఇహ అంతే. ఊరూ వాడా మోత మోగించేస్తారు. లేకపోతే ఇక్కడ మన షాపింగ్ గురించీ, డిస్కౌంట్ సేల్స్ గురించి తాటాకులు కట్టేస్తారు. మరి హైదరాబాద్ లో ఐకియా స్టోర్ ఓపెనింగ్ నాడు షాపింగ్ కని తరలి వచ్చిన వారిని చూసి ఆ గోవిందనామాల వాడే ముక్కున వేలేసుకోలేదూ! మరి వారసత్వం ఎక్కడికి పోతుందీ. అంతా ఒక తానులో ముక్కలమే కదా!

ఇలా రెండో ఏడు థాంక్స్ గివింగ్ షాపింగ్ గడిచిపోయింది. ఈ సారి మాత్రం ఆ వ్యామోహం వీడి కళ్ళు తెరచి తెలివి తెచ్చుకుని గమనిస్తే తెలిసొచ్చింది ఏంటంటే ప్రతి ఏడూ అవే వస్తువులు పెడుతున్నారని. తగ్గించి అమ్మేవంతా చిన్నా చితకా సామానే. గచ్చుపై ఆవాల్లా సంవత్సరాలు దొర్లిపోతుంటాయి గానీ మళ్ళీ మళ్ళీ అవే కుక్కర్లు, చెంబులూ, నాన్ స్టిక్కు తపేళాలు. ఎంత మంచి బ్రాండు నాన్ స్టిక్ సామానైనా సంవత్సరం తిరిగేసరికి కోటింగ్ లేచి ఊడొస్తోంది. అదంతా పొట్టలోకే కదూ చేరేది. ఇహ ఇలాక్కాదని సుబ్బరంగా ఒక మూకుడు తెచ్చుకుని అందులో వండడం మొదలుపెట్టా. ఇంతోటి మా కుటుంబానికి అదొక్కటి చాల్లే అనుకుని.

ఇదంతా ఒక ఎత్తు అయితే బే ఏరియా కి వచ్చాక చేసిన థాంక్స్ గివింగ్ షాపింగ్ వల్ల ఏకంగా కపాల మోక్షం సిద్ధించింది. అంతకు ముందంటే ఏదో కుగ్రామంలో కాసింత జనాభా ఉన్న ప్రాంతంలో ఏలేసాము. బే ఏరియా కి వచ్చిన తరువాత పిల్ల కాలువలోంచి సముద్రం లోకి పడ్డట్టు అయింది. ఏ సమయంలో వెళ్లినా ఇహ ఎంతకీ కదలని లైన్లు, ఏదైనా కొందామంటే తలకొక మూలలో ఉండే వస్తువులు. అచ్చంగా యుద్ధం ముగిసిన తరువాత రణరంగంలా ఉంటాయి మాల్సు. అశోక చక్రవర్తికి కళింగ యుద్ధం తరువాత ఎటువంటి వైరాగ్యం వచ్చిందో, ఒక నాలుగు థాంక్స్ గివింగ్ల తరువాత నవంబరుకి అదే వైరాగ్యం అలముకునేది నన్ను. వచ్చిన కొత్తల్లో ఇక్కడి ఆచారం తెలీక పట్టించుకోలేదు గానీ, 'థాంక్స్ గివింగ్ ' అంటే "మాకు ఉన్నవాటితో మేము ఆనందంగా ఉన్నాము. మాకు అవసరమైన తిండీ, బట్ట, గూడు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తండ్రీ" అని కుటుంబం అంతా కలిసి జరుపుకునే పండుగట. ఇప్పుడున్నవి చాలు మహాప్రభో! అని దండాలు పెట్టేసుకుని మరుసటి రోజే కొత్త సామాన్ల కోసం పోటీలు పడడం ఎంత విచిత్రం అనిపించ సాగింది.

పైగా లక్కపిడతంత అపార్టుమెంటుల్లో ఈ సామానంతా సర్దలేక చచ్చే చావొచ్చేది. ప్రతి ఏడూ కాసిన్ని బయటపడేస్తే కానీ కొత్తవి ఇంట్లోకి తెచ్చే వీలు లేదు. ఇదంతా ఒక మాయా వలయంలా అనిపించేది. కొన్న వాటిల్లో సగం వాడేవే కాదు. "మా ఇంట్లో ఉంది" అంటే "మా ఇంట్లోనూ ఉందమ్మా!" అని చెప్పుకోడానికి తప్ప. కొనుగోలు శక్తి పెరిగింది కదా అని ఎన్నని కొంటాము. చివరికి సామానంతా లోపలేసుకుని మేము బయట ఉండాలి ఇక. ఊపిరాడనన్ని రకాలు వస్తుంటాయి ప్రతి ఏడాది.

అరుణాచలం సినిమాలో పెద్ద రాజనీకాంతుకి రాత్రంతా చుట్టలు పీల్చి పీల్చి చుట్టలంటే విసుగొచ్చినట్టు, ఇన్నేసి రకాలు అందుబాటులోకొచ్చేసరికి షాపింగ్ అంటేనే విరక్తి పుట్టేసింది. హాయిగా అన్నీ మానేసి నిత్యావసరాలు, పనికొచ్చేవి మట్టుకు ఆన్లైన్లో కొనేసి బుద్ధిగా ఇంట్లో ఉండిపోయాము. మొహమాటాలకి తెరదించేసి సుఖంగా ప్రశాంతంగా నవంబరు మాసపు దీక్షని పూర్తి చేయడం

నేర్చేసుకున్నాం. ఈ ఏడు నా షాప్పింగు నేటి ఆధునిక జనుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఇంస్టా పాటుకి మాత్రమే పరిమితం చేసా. కొట్లో మిగతా సామాన్లు ఎన్ని స్పెషల్ డాన్సులు చేసినా లొంగిపోయే ప్రసక్తే లేదు. కొన్ని పాఠాలు అనుభవాల మీద కానీ రావు కదా మరి!

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments